# లంచం

"అంత ఖరీదయిన పట్టుచీర కొన్నాను కదా - మరి నాకేమిస్తావు?" కొంటెగా చూస్తూ అన్నాడు రాజారావు.

షాపింగ్ ముగించుకుని రెణ్ణిముషాల క్రితమే ఇంటికి చేరారు కొత్తగా పెళ్ళయిన రాజ్యం, రాజారావులు.

"పట్టుచీర లంచమా" చీరను మార్చుకోబోతున్న రాజ్యం భర్త దగ్గరకు నడిచి అతని కళ్ళల్లోకి సెక్సీగా చూసింది.

"ఈ రాత్రికి స్వామివారి నైవేద్యంలో అన్నీ స్పెషల్సే" అంది అతని మెడమీద సుతారంగా చేతులు వేసి తన తలను కొద్దిగా పైకెత్తి పెదవుల్ని సున్నాలా చుట్టి.

"అంతేనా" అన్నాడు రాజారావు నిరాశగా, తన మొహాన్ని కొద్దిగా కిందకి వంచుతూ. "ఏకంగా రెండు వేలు..."

"చూస్తారుగా - అన్నీ స్పెషల్సే. ఈ దెబ్బకు డంగైపోయి రోజుకో పట్టుచీర కొనిస్తానని పట్టుపడతారు" కన్నుగీటుతూ కిలకిలా నవ్వింది రాజ్యం.

ఆ రాత్రి రెండు వేలకు సరిపడా స్వర్గ సుఖాల్నిరుచి చూశానన్న తృప్తి రాజారావులో.

భార్యవైపు ప్రేమగా చూశాడు.

"నాకు రవ్వల నెక్లెస్ చేయిస్తానన్నారుగా, చెప్పి కూడా మూణ్ణెల్లు దాటింది.

శోభనం రోజు రాత్రి చెప్పారు" బుంగమూతి పెట్టింది రాజ్యం. ఆమెకు తెలుసు అది తిరుగులేని సమయం అని. సరియైన స్థలంలో, సరియైన సమయంలో ఆడది ఏ కోరిక కోరినా మగవాడు కాదనలేడని ఆమె బామ్మ ఉవాచ.

"నాకు వంశోద్ధారకుణ్ణి ఇచ్చిన రోజు నీకు రవ్వల నెక్లెస్" అన్నాడు రాజారావు సిగరెట్ వెలిగిస్తూ.

"అంతేనా - మరి కూతురు పుడితే. .."

"మా అమ్మ చేత చివాట్లు"

☆ ☆ ☆

రాజ్యానికి కొడుకు పుట్టాడు. వాడికిపుడు రెండేళ్ళు.

"ఈ ఒక్క ముద్ద తినరా బాబీ. బోల్డు నెయ్యేసి కలిపాను. మా బంగారం కదూ. మా తండ్రివికదూ" బ్రతిమాలుకుంటోంది రాజ్యం.

వాడు తిననని మారాం చేస్తున్నాడు.

ఎత్తుకుని ఆరుబయటకు తీసుకెళ్ళింది. చల్లటి గాలి ఆహ్లాదంగా వీస్తోంది. ఆకాశంలో నిండు చంద్రుడు గారాలు పోతున్న బాబిలా ఉన్నాడు అనుకుంది రాజ్యం మురిపెంగా.

"చంద మామ కావాలా" ఆశగా అడిగింది రాజ్యం అలా అయినా అన్నం తింటాడని.

"కావాలి" ఆనందంగా తల వూపాడు బాబీ.

"నీవు మొదట అన్నం తిను. తర్వాత నీకు చందమామని తెచ్చిస్తాను"

వాడు తినటం అయిపోయిన వెంటనే "నాకు చందమామ కావాలి" అని ఏడుపు లంకించుకున్నాడు.

రాజ్యం చాలాసేపు వాడిని ఆరుబయట తిప్పి చందమామను చూపించినా వాడు వూర్కోలేదు. చందమామ తన చేతిలోకి రావాలని మొండిపట్టు. వాడు ఏడ్చి ఏడ్చి సొమ్మసిల్లి పోయాడు. వాణ్ణి బుజ్జగించి బుజ్జగించి రాజ్యం అలసిపోయింది. ఇంకెప్పుడూ అలవి కానివి ఇస్తానని ఆశ చూపకూడదని రాజ్యం నిర్ణయించుకుంది. చందమామలాంటివి అడిగితే - ఎంత ఏడ్చినా ఎందుకోమరి తెచ్చివ్వలేరని బాబిగాడి బుజ్జి మనసుకి అర్థమైంది.

రాజారావు ఇంటికి దగ్గర్లోనే రైలు పట్టాలున్నాయి. ఆరుబయట నిలబడి చూస్తే రైళ్ళు వస్తూ పోతూ కన్పిస్తుంటాయి.

ఓ రోజు బాబిగాడు రైలు చూపించి "నాకు రైలు తెచ్చిస్తేనే అన్నం తింటానని" మారాం చేశాడు. అప్పటికప్పుడు రాజారావు బజారు కెళ్ళి బ్యాటరీతో నడిచే రైలు తెచ్చిచ్చాడు. బాబిగాడి కళ్ళలో విజయం తాలూకు మెరుపు.

"స్నానానికి రారా బాబీ" అరగంట నించీ పిలుస్తూనే ఉంది రాజ్యం. బాబిగాడు కదలనేలేదు.

"నాలుగంటిస్తే సరి" కోపంగా దగ్గిరకొచ్చిన రాజ్యాన్ని చూసి బాబిగాడు పెద్దగా ఏడ్వటం ప్రారంభించాడు.

రాజ్యం వాణ్ణి ఎత్తుకుని ముద్దు పెట్టుకుంది.

"మా నానీవి కదూ స్నానం చేస్తే నీకు బోల్డు చాక్లెట్లు కొనిస్తాను" అంది.

"బోల్డు అంటే ఎన్ని?"

"ఇన్ని" చేతుల్తో చూపించింది.

బాబిగాడు సంతృప్తిగా తలాడించాడు. ఆ సాయంత్రం వాళ్ళ నాన్న చేత బోల్డు చాక్లెట్లు కొన్పించాక కానీ వాడు వూరుకోలేదు.

బాబిగాడికిపుడు ఐదేళ్ళు.

వాడికిపుడు ఓ విషయం స్పష్టంగా అర్థమైంది. ఎదుటి వ్యక్తి కవసరమైన పనులు చేయాలంటే తన కిష్టమైనవి అడిగి సాధించుకోవచ్చని, తన కిష్టమైనవి పొందటానికి ఎదుటి వ్యక్తికిష్టమైన రీతిలో ప్రవర్తిస్తే చాలని.

"బాబిగా - నాన్నగారు ఆఫీస్ నించి వచ్చే లోపల ఈ పాఠం చదివి తప్పుల్లేకుండా సమాధానాలు చెప్తే నీకు మంచిడ్రెస్ కొనిస్తాను" లాంటి వూరింపులకు వాడి కళ్ళు ఆశగా మెరిసేవి. వాటి కోసం కష్టపడి చదివేవాడు. పరీక్షల్లో మంచి మార్కులు వచ్చేవి.

బాబి పదోతరగతిలో ఉన్నప్పుడు "నీవు ఫస్ట్ క్లాస్‌లో పాస్ అయితే నీకు సైకిల్ కొనిస్తాను" అని రాజారావు కండిషన్ పెట్టాడు.

బాబి సైకిల్ మీద కాలేజికెళ్ళటం ప్రారంభించాడు.

ఇంటర్‌లో ఫస్ట్ క్లాస్ తెచ్చుకుని వాళ్ళ నాన్న చేత లూనా కొన్పించుకున్నాడు బాబి - బాబూరావ్.

☆ ☆ ☆

వనజా, బాబూరావు పార్కులో ఓ చెట్టు కింద కూచున్నారు. ఇద్దరూ డిగ్రీ ఫైనలియర్ చదువుతున్నారు.

"నా ప్రేమ కోసం ఏమైనా చేయగలవా?" వనజ అనుమానంగా అడిగింది.

"ఏమైనా చేస్తేనే గానీ ప్రేమించవా?" అని బాబూరావు అడగలేదు. తనకిష్టమైనది పొందాలంటే ఎదుటి వ్యక్తి కిష్టమైనది చేయాలన్న ప్రాథమిక సూత్రం అతను మరచిపోలేదు.

"అంత అనుమానం దేనికి? కావాలంటే పరీక్షించి చూడు. నీ ప్రేమ కోసం ప్రాణాలైనా ఇస్తాను" అన్నాడు.

ఫక్కున నవ్వింది వనజ.

"ప్చ్. ప్రాణం నాకెందుకూ పనికిరానిది. రేపు నా పుట్టిన రోజు కదా. డైమండ్ రింగ్ పెట్టుకోవాలని నాకెన్నాళ్ళనించి కోరికో" కళ్ళు చక్రాల్లా తిప్పుతూ చెప్పింది.

అంత ఖరీదయిన వస్తువు కొనడానికి రాజ్యానికి తెలియకుండా బీరువాలోని గొలుసు అమ్మేయాల్సి వచ్చింది. అయినా తప్పదు కదా. ఎరవేస్తేనే చేప గాలానికి తగిలేది.

వనజ తన పుట్టిన రోజు నాడు డైమండ్ రింగ్ వేసుకుని మురిసిపోయింది.

"నాకో ముద్దివ్వవూ" చాలా దీనంగా అడిగాడు బాబూరావు.

వాళ్ళిద్దరూ బాబూరావు వాళ్ళింట్లోని ఓ గదిలో కూచుని ఉన్నారు.

"అమ్మో నాకు భయం" వనజకళ్ళలో సంతోషం దాచుకుంటూ భయం నటించింది.

"ఎందుకూ నేనేగా. మనం ఆర్నెల్ల నించీ ప్రేమించుకుంటున్నాం కదా" అలా ఆర్నెల్లుగా ప్రేమించుకోవటమే దానికి అర్హత అయినట్లు, అందువల్ల ఆ అధికారం తనదేనన్నట్లు చెప్పాడు బాబూరావు.

"పెళ్ళాయాకే అవన్నీను. నా భర్తకు తప్ప నన్ను తాకే అధికారం ఎవ్వరికీ ఇవ్వను" బార్టర్ సిస్టంలో తనకేం కావాలో చెప్పింది వనజ.

"నేను నిన్ను తప్ప మరెవర్నీ పెళ్ళి చేసుకోను. నీవే జన్మ జన్మలకూ నా భార్యవి" బాబూరావు వనజను కౌగిలించుకుని ముద్దు పెట్టుకున్నాడు.

"నన్ను తప్పకుండా పెళ్ళి చేసుకుంటావుగా" అడిగింది ఆశగా వనజ.

"తప్పకుండా" ఇంకొంత ప్రొసీడ్ అవుతూ చెప్పాడు బాబూరావు ముద్దముద్దగా.

"వద్దు" బలహీనంగా అంది వనజ.

"నిన్ను పెళ్ళి చేసుకోవాలా వద్దా? పెళ్ళి చేసుకోవాలంటే ముడుపులు ముందుగా

నమర్పించాల్సిందే'' పసితనంలో రైలుబొమ్మ కొనిస్తేనే అన్నం తింటానని మొండికేసినంత ఖచ్చితంగా చెప్పాడు.

"పెళ్ళి చేసుకుంటారన్న నమ్మకంతో. . . ఒప్పుకుంటున్నా" వనజ గుసగుసలుగా బాబూరావు చెవిలో చెప్పింది.

బాబూరావు బోల్డు కట్నంతో ధనలక్ష్మిని పెళ్ళిచేసుకున్నాడు. అతని మామగారు సివిల్ కాంట్రాక్టరు. ఆ కట్నంలో కొంత పర్సెంటేజ్ వదులుకోవటం అనే కండిషన్ మీద ఓ ఆఫీసులో ఉద్యోగం వేయించారు.

మొదటిరోజు ఆఫీసుకెళ్ళే ముందు చాలా హడావుడి చేశాడు బాబురావు.. . . నల్లచారలున్న టెర్లిన్ షర్ట్‌ని తెల్ల ప్యాంట్‌లో టక్ చేశాడు. నల్లగా నిగనిగా మెరుస్తున్న బూట్లు వేసుకున్నాడు. క్రాఫ్ నున్నగా దువ్వుకున్నాడు. మొహానికి అరంగుళం మందాన పౌడర్ కోటింగిచ్చాడు. ధనలక్ష్మి చిర్నవ్వుతో ఎదురాగా మామగారిచ్చిన కొత్త స్కూటర్ మీద ఆఫీస్ టయానికి అరగంట ముందే బయల్దేరాడు.

ఆఫీస్ ప్రొసీజర్ ప్రకారం అన్నీ జరిగాక బాబురావు తన సీట్లోకొచ్చి కూచున్నాడు.

"నమస్తే సార్" ఎదురుగా నలభయ్యేళ్ళ కళ్ళద్దాల ఆసామి.

"ఏం పని?" దర్జాగా అడిగాడు బాబూరావు.

ఫలానా ఫైలు తనదనీ - ఏ అడ్డంకులూ లేకుండా పని పూర్తి కావాలని - రేపట్లోపలే అయితే మంచిదనీ నసిగాడతను. ఎవరూ చూడటం లేదని నిర్ణయించుకుని బాబూరావు చేతిలో కొన్ని నోట్లు పెట్టాడు.

"సరే - అలాగే - తప్పకుండా - రేపు రండి'' వినయంగా జవాబిచ్చాడు బాబూరావు.

తను వెళ్ళిపోయాక తీరిగ్గా లెక్కపెట్టుకున్నాడు. ఐదు వంద రూపాయల నోట్లు.

"ఈ సీట్లో లంచాలు బాగానే ముట్టాయన్మాట" మనసులోనే తృప్తిగా నవ్వుకున్నాడు బాబూరావు.

"అయినా లంచాలేమిటి? ఆ పదం అసహ్యంగా ఉంది. నాకిష్టమైన డబ్బు కావాలంటే ఆ పార్టీకిష్టమైన పని చేయాలి. ఇదేగా ఉగ్గుపాల నించీ నేను నేర్చుకున్న -నాకు తల్లిదండ్రులు బోధించిన ప్రాథమిక సూత్రం" అని సమర్థించుకున్నాడు.

ఎటొచ్చీ అతనికి ఓ విషయం మాత్రం అర్థంకాలేదు. తల్లిదండ్రులు తనకు ఇచ్చిన లంచాలు కేవలం అతని అభివృద్ధినీ, ఔన్నత్యాన్ని కోరి ఇచ్చారనీ - తనిప్పుడు తీసుకున్న లంచం నాణేనికి రెండోవైపని - ఆ వైపంతా అమావాస్య చీకటిలా బ్లాక్‌గా ఉంటుందని.

● *మయూరి వీక్లీ, నవంబర్ 3, 1995* ●